కథ

# పరువు

ఉర్దూ మూలం: సఘ్రామెహ్‌ది
అనువాదం: సి. హెచ్. శ్రీనివాసమూర్తి

**టింకూ! ఇలారా... అరె... ఎక్కడికి? ...అక్కడ కార్లు అవీ తిరుగుతున్నాయి. పింకీ... నువ్వు కూడానా! ... ఎక్కడికి పోతున్నావ్..."**

**ఆమె అరుస్తూనే ఉంది, కాని పిల్లలు గెంతులేసుకుంటూ అప్పటికే ఆట మొదలుపెట్టిన పిల్లలతో కలిసిపోయారు. శ్వాస బరువెక్కి, ఆమె ప్రక్కనున్న బెంచీ మీద కూర్చుంది.**

"మీరు కనీసం రెండు గంటలు రోజూ వాకింగ్ చెయ్యాలి. డాక్టరుగారు చెప్పారు". కోడలి హెచ్చరిక చెవుల్లో మారుమ్రోగింది. "పిల్లలను పార్కుకు నేను దివాన్‌సింగ్‌తోనైనా పంపించగలను. కాని మీకు ఈ విధంగానైనా ఎక్సర్‌సైజ్ అవుతుంది. బయటి గాలి దొరుకుతుందని..."

కోడలి దృష్టిలో నేనొక తెలివిమాలిన దాన్ని. దేవుడు తెలివంతా తనొక్కదానికే అప్పనంగా అప్పచెప్పాడు. తనను పార్కుకు పంపించి, దివాన్‌సింగ్‌తో అడ్డమైన చాకిరీ చేయించొచ్చు. పైగా తన ఆరోగ్యం మీద లేని చింత వొలకపోయటం. ఎవరికి తెలీదు. మీగడ లేని పాలు ఎండిన రొట్టెలు- పైగా ఆరోగ్యం మీద లేనిపోని వగలు.

ఎదురుగా ఐస్‌క్రీం అమ్మేవాడు. ఎవరైనా చూస్తున్నారేమోనని అటూ యిటూ చూసింది. పింకీ టింకూలిద్దరూ ఆటల్లో నిమగ్నమైపోయారు. తన చిన్న పర్స్ నుండి డబ్బులు తీసి వాడికిచ్చింది. వాడు పరుగెత్తికెళ్ళి, ఐస్‌క్రీంను చాటుమాటున పెట్టుకుంటూ తెచ్చి ఆమెకందించాడు. కొద్దిగా చాటున్న చోటికి పోయి, ఐస్‌క్రీంను ఆనందంగా తినటం మొదలుపెట్టింది. ఐస్‌క్రీంవాణ్ణి కదిలిపొమ్మని కళ్ళతోనే సైగ చేసింది. చాక్‌లెట్ ఐస్‌క్రీం అంటే ఆమెకు చిన్నతనం నుండి ప్రాణం. స్కూలు కాలేజీ రోజుల్లో కూడా, తన స్నేహితురాలు చంప, తన ఐస్‌క్రీం ముందుగా లాగించేసి, తన చేతిలోది లాక్కోవాలని ప్రయత్నిస్తే, దెబ్బలాడేది. చంప యిప్పుడెలా ఉందో, ఎక్కడుందో! చివరగా ఆమె దగ్గరి నుండి, న్యూయార్క్‌లో కొడుకును చూడటానికి పోయినప్పుడు వచ్చింది.

చాటునే వుండి మరోసారి పిల్లలు తనను గమనిస్తున్నారేమోనని చూసింది. వాళ్ళు బామ్మను గమనించే స్థితిలో లేరు.

సతీష్‌తో వివాదాలొచ్చినప్పుడు ఐస్‌క్రీంతోనే రాజీలయ్యేవి. సాల్మన్ కూడా తరచుగా ఆమెకోసం ఐస్‌క్రీంలు తెచ్చేవాడు. సాహిల్ తన చిన్నతనంలో, తన ఐస్‌క్రీం కోసం ఎగబడితే యిచ్చేది కాదు. అప్పుడప్పుడూ సాల్మన్‌తో మాటలనిపించుకోవాల్సి వచ్చేది.

"ఐస్‌క్రీం కోసం చిన్న పిల్లలతో పంతాలేమిటని"

"ఐస్‌క్రీం కోసం పంతం... నో...నో, అందరి గయ్యాళి అత్తల్లాగా తను తన కోడలిని ఏ విషయంలోనూ తప్పు పట్టదూ... యిందులో ఆమె తప్పేముంది. ఆ రోజు తను డ్రాయింగ్ రూంలోకి పోయి ఉండాల్సింది కాదు. ఎందుకు పోయింది? ఆఁ... పేపర్ కోసం పోయింది. కొడుకూ కోడలు పక్క పక్కనే కూర్చుని ఐస్‌క్రీం తింటూ టి.వి.లో సినిమా చూస్తున్నారు. తనను చూసి ఉలిక్కిపడ్డారు. నిజానికి తను కూడా యిబ్బందిగా ఫీలయింది. "ఏం లేదు" అంటూ వెనుదిరిగి తన గదిలోకొచ్చిపడింది.

"అమ్మా! ఏమైంది?" గుమ్మంలో సాహిల్.

అహఁ. ఏం లేదు.

"మరి ఎందుకు నీ కంఠం తడబడ్తోంది? ...యిటు చూడు... నా వైపు... ఆ కళ్ళల్లో నీళ్ళేమిటి? నీకు ఎప్పుడూ ఐస్‌క్రీం తీసుకొస్తూనే ఉన్నాంగదా! ఈసారి... ..."

"సాహిల్ నేను ఐస్‌క్రీం కోసం ఏడవటానికి చిన్నపిల్లనా? ఏమిటా మాటలు?"

అమ్మా! నాకు తెలుసు. నీ కోసం ఐస్‌క్రీం తేలేదని నీకు కోపమొచ్చింది... కానీ... ..."

"సాహిల్! అనవసరంగా వాగకు... ..." యింతలోనే కోడలు కూడా వచ్చింది.


ఈ చిన్న విషయానికే తను ఎంత డిస్టర్బ్ అయింది. చాలాసేపు కళ్ళొత్తుకుంటూనే ఉంది. సాయంకాలం కోడలు ఎవరితోనో ఫోన్లో తన గురించి చెప్పటం తన చెవిన పడింది. "మా అత్తగారు మా మీద అలిగారు... ఆమె కొడుకు నాతో పాటు ఐస్‌క్రీం తింటుంటే చూసి కోపమొచ్చింది... నిజం... నా మీదొట్టు... అవును... ఆమె టీచర్‌గా చేసి రిటైర్ అయింది... ..."

ఆ రోజే నిర్ణయం తీసుకుంది, యిక



జీవితంలో ఏనాడూ ఐస్‌క్రీం ముట్టుకోకూడదని. సాహిల్ ఎంత బలవంతం చేసినా ఆమె తినలేదు. కొంతకాలం అసలు ఐస్‌క్రీమే ఆ యింటి గడప తొక్కలేదు. తర్వాత అడపా దడపా వచ్చినా తను మాత్రం తాకనైనా తాకలేదు.

కానీ పిల్లలను పార్కులో ఆడించటానికి తీసుకురావటంలో ఆమె పంతం సడలింది. అప్పుడప్పుడూ వాళ్ళు చూడకుండా చాటుమాటున తినటం మొదలుపెట్టింది. ఐస్‌క్రీం అమ్మేవాడు కూడా, ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్నవాడిలా, బండిని దూరంగా ఉంచి, ఆమె ఎదురుగా ఆజ్ఞ కోసం మౌనంగా నిలబడతాడు. సైగ అందుకుని, దాపరికంగా అందిస్తుంటాడు.



కప్ చెంచాలను చెత్తకుండీలో వేసే సమయంలో.

"అశీ!" అని ఎవరిదో పిలుపు వినిపించింది. ఆమె ఉలిక్కిపడి చూసింది. తనను పేరుపెట్టి మరీ పిలిచేవాళ్లెవరా పార్కులో. అమ్మ, దాదీ, అమ్మగారు, నానమ్మ లాంటి సంబోధనలకే అలవాటుయిన చెవులకు అశీ!" అనే పిలుపులో ఏదో తెలియని ఆత్మీయభావం మెదిలింది.

ఎదురుగా వయసుమళ్ళిన వ్యక్తి. తల మీద కేప్, చేతిలో వాకింగ్ స్టిక్ తనవేపే పరిశీలనగా చూస్తూ నిల్చున్నాడు.

"సారీ, నేను మిమ్ములను గుర్తుపట్టలేదు" చీరకొంగుతో చేతులు తుడుచుకుంటూ అంది.

"మీరు ఉజ్జయిని కాలేజీలో చదివిన మిస్ జైడి కాదా?"

అవును. కాని మీరు...?

అతను నింపాదిగా బెంచి మీద కూర్చుని, శ్వాస సరిచేసుకున్నాడు. దగ్గరగా చూస్తే ఆ ముఖం తనకు సుపరిచితమేనని పించింది.

"ఓహ్! మీరు సతీష్‌చంద్ర మల్హోత్రా కదూ? అంది ఆశ్చర్యంగా.

"అవును. సతీష్‌నే. చాలా రోజుల నుండి నిన్ను గమనిస్తూనే ఉన్నాను"

"తమాషాగా ఉంది సతీష్. నీవు నన్ను గుర్తించావు. మనం చివరిసారిగా సాహిల్‌కు పన్నెండేండ్లున్నప్పుడు కలుసుకున్నాం. వాడిప్పుడు యిద్దరు పిల్లల తండ్రి. అరుగో వాడి పిల్లలు... ఆడుకుంటున్నారు. పొడుగ్గా ఉన్నాడు చూశావా..."

"నాకు తెలుసు. ఎందుకంటే చాలా దినాల నుండి వాళ్ళ నానమ్మను గమనిస్తూనే ఉన్నాను" అని బిగ్గరగా నవ్వాడు. నవ్వి "నీ వెంట పడే అలవాటును నేనింకా మానలేదు అశీ" అన్నాడు.

"పరధ్యానంగా, ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉండటం కూడా మానలేదు".

"అవునూ... నువ్వు... యిక్కడ..."

నేను నా కొడుకు దగ్గర వుంటున్నాను. కొద్ది రోజుల క్రితమే యిక్కడికి ట్రాన్స్ఫర్ మీదొచ్చాడు. నా కూతురు విదేశాల్లో వుంది. వాళ్ళమ్మ ప్రస్తుతం ఆమెతోనే ఉంది.

"మరి నువ్వెందుకు వెళ్ళలేదు?"

మేము మార్చి మార్చి వెళ్తుంటాము. ఉద్యోగరీత్యా మా వాడు ఊర్లు తిరుగుతుంటాడు. అందుకని నేను వాడితోనే ఉంటాను. అప్పుడప్పుడూ ఆమె యిక్కడున్నప్పుడు నేను కూతురింటికి పోయి వస్తుంటాను. స్కూల్ నుండి రిటైరైన తర్వాత, దాదీ, నానీల వుద్యోగం చేస్తున్నాను". నీ వుద్యోగం కూడా నాకు అర్థమయింది. చాలా దినాల నుండి నిన్ను గమనిస్తున్నాను. శక్తులుడిగీ, పిల్లలతో అవస్థ పడుతూ, వాళ్ళను గద్దిస్తూ, తగూలాడుతూ పార్కులో ఆడించటానికి వస్తావు. బెంచీమీద కూర్చుని ఏవేవో ఆలోచనల్లో కూరుకుపోతావు. ఈ స్థితి, ప్రపంచం నీకు సంబంధించినది కానిదానిలా, మరేదో లోకం కోసం వెతుకుతున్నట్లుంటావు. నేను గమనిస్తున్నా 'నువ్వేనా' అనే అనుమానంతో పలకరించలేకపోయాను. యిప్పుడు చాటుగా ఐస్‌క్రీం తినటం చూసి నువ్వే అయివుంటావని తీర్మానించుకున్నాను. నా అనుమానం నిజమైంది. అసలు నువ్వు ఎందుకిలా తయారైనావు? చూడబోతే, నీ పట్ల, నీ ఆరోగ్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ తీసుకోనట్లుంది. కుంటుతూ నడుస్తున్నావు. కాలికేమయింది? దెబ్బేమయినా తగిలిందా?"

"దెబ్బ కాదు, కీళ్ళనొప్పి"

"యిది అజాగ్రత్తపరులు, శరీరాన్ని పెంచినవాళ్ళకు రావల్సింది"

నా విషయం వొదిలిపెట్టు. నీవేంటి యిలా తయారైనావ్. పొట్ట బాగానే పెంచావు. చేతిలో ఆ లాఠీ, కళ్ళకు పెద్ద పెద్ద గాగుల్స్... మధ్య మధ్యన ఆ పొడి దగ్గు... ..."

యిద్దరూ కలిసి హాయిగా నవ్వుకున్నారు.

"చూడు నానీ! టింకూ నన్ను తోసేసింది" పింకి ఫిర్యాదు చేసింది.

"ఇది ఆటలో తొండి చేస్తోంది" టింకు సమాధానం. అతని మోకాలిచిప్ప మీద రక్తం చూసి ఆమె గాబరా పడింది. "పింకీ నీ మతి మందగించింది..."

"నీ పేరేమిటి టింకుగారూ?" సతీష్ అడిగాడు.

"నా పేరు ఆదిల్‌సాల్మన్. మీరెవరు?"

"నేను మీ నాన్నమ్మ పాత ఫ్రెండ్‌ని. నేను కూడా చిన్నప్పుడు మీ నాయనమ్మను ఆటల్లో చేసే తొండిని సహించాను" అని ఆశీకేసి చూసి నవ్వుతూ "నీ మనుమరాలు వాళ్ళ నాన్నమ్మను మించిపోయిందే" అన్నాడు.

"అనవసరంగా చాడీలు చెప్పొద్దు సతీష్" అంది చిరుకోపంతో.

పిల్లలు వారిద్దరి వైపు అమాయకంగా

విస్తుపోతూ చూశారు.

"చాలా కాలం తర్వాత నా నేరం మరోసారి వింటున్నా". సరేలే. నేను వెళ్తాను పిల్లలకు టైమయింది. యింటికి చేర్చాలి" అంది ఆశీ.

"రేపు వస్తావా?"

"వస్తా"

"ఈ సమయానికి యిక్కడే ఎదురు చూస్తుంటా" అన్నాడు సతీష్.

ఇద్దరు పిల్లలను వెంటేసుకుని, కొద్దిగా కుంటుతూ, ఎప్పుడూ అల్లరి చేసే మాటకు మాట జవాబు చెప్పే, తన పంతం మీద నిలబడే తన పాత స్నేహితురాలి



ఆశాను చూస్తూ నిల్చున్నాడు సతీష్.

ఇంటికి వస్తూంటే ఆమెలో ఏదో శూన్యత ఆవహించినట్లయింది. దేనినో జీవితంలో పోగొట్టుకున్న భావన. యిల్లు చేరగానే తన గదిలోకి వెళ్ళి మంచంపై వాలిపోయింది. తనకు యిష్టమైన టి.వి.సీరియల్ చూడటం కూడా మరిచిపోయింది.

ఏమయిందమ్మా? ఒంట్లో నలతగా వుందా?" సాహిల్ అడిగాడు.

"ఏం లేదు సాహిల్. ఎందుకో ఈ రోజు నిద్రొస్తోంది".

"అయితే నిద్ర పో" తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు, లైటు తీసి.

***

ఇలాగే ఉన్నట్లుండి తన జీవన మార్గంలో సతీష్ తారసపడుతుంటాడు. ఉజ్జయినిలో, మాధో కాలేజీలో చదివే రోజులు, అతనితో స్నేహం, తమకు తోడుగా చంప, తమ ముగ్గురి స్నేహం కాలేజీలో అందరికీ తెలుసు. పిల్లలందరికీ, సతీష్ ఎఫైర్ ఆశాతోనో, చంపతోనో అర్థంకాక జుట్టు పీక్కునేవారు. చివరికీ విషయం తండ్రికి కూడా తెలిసింది. కనీసం తనను మాట మాత్రమైనా వివరణ కోరకుండా, అసలా ప్రసక్తే తనవద్ద తేకుండా, తనను ఢిల్లీలో బాబాయి దగ్గరకు పంపించేశాడు. కానీ సతీష్ తనను అక్కడ కూడా వొదలలేదు. ఒకసారి బస్‌స్టాప్‌లో నిల్చుంటే ఎదురై "ఆశీ, పద. మనం ఎక్కడికైనా వెళ్ళిపోదాం" అన్నాడు.

"ఏం మాట్లాడుతున్నావ్ సతీష్. దేనికి పారిపోవాలి. నీకు పిచ్చెక్కలేదుగదా" అనింది తను. మరో మాటకు తావివ్వకుండా బస్సెక్కి వెళ్ళిపోయింది. వారం వారం అతడామెను కాలేజీలో కలిసేవాడు. వచ్చినప్పుడల్లా పెళ్ళి ప్రస్తావన తెచ్చేవాడు. "మనం గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసుకుందాం. కొన్నాళ్ళు గడిస్తే అంతా సద్దుమణిగిపోతుంది. కాలం ఎలాంటి గాయాల్నయినా మాన్పుతుందంటారుగదా" అని భరోసా యిచ్చాడు. కానీ ఆమె ఒప్పుకోలేదు.

"మనం కోరుకున్న విధంగా పెళ్ళి చేసుకోవటం మన హక్కు. ఆ హక్కును సాధించుకుందాం. అంతేగాని, మాటిమాటికి ఈ రహస్యపు పెళ్ళిమాట ఎత్తొద్దు. పారిపోవటానికి మనం చేస్తున్న నేరమేముంది? అలా చేయటం నీకూ అవమానమే, నాకూ అవమానమే. మన యిద్దరి కుటుంబాలకు అవమానం" అనింది.

"ఆశీ! యిదే నీ బలహీనత. లేదంటే నా

***తన వివాహం సాల్మన్‌తో జరిగిపోయింది. జరిగినదాంట్లో సాల్మన్ తప్పేముంది? అందుకే అతనితో వివాహ జీవితంలో పూర్తిగా రాజీ పడింది. జీవితం సాఫీగా, సుఖంగా గడవటానికి పూర్తి సహకారాన్ని అందించింది. సాల్మన్ కూడా ఆమెకు ఎలాంటి లోటూ లేకుండా చూసుకున్నాడు.***

మీద నీకు ప్రేమ లేదని తేల్చి చెప్పు. మరోసారి నీ జోలికి రాను".

"నీవు అలా అనుకుంటే నేను చేయగలిగిందేమీ లేదు. అలాగే అనుకో".

తనకు తెలియకుండా తన తండ్రి దగ్గరికి వెళ్ళి పెళ్ళి విషయం మాట్లాడటానికి సతీష్ వెనుకాడలేదు. దాని ప్రభావం తన తండ్రి మీద బాగా పడింది. హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైంది. ఫలితంగా సతీష్‌తో వివాహ ప్రసక్తి తీసుకురానని, అసలు అతనితో మరోమారు కలవననీ, తండ్రికి మాట యివ్వాల్సి వచ్చింది. ఆ రోజు అమ్మ, ఏడుస్తూ తన చేతులు పట్టుకుని, "ఆశా! నువ్వు నాన్న ప్రాణాన్నే కాకుండా ఈ కుటుంబ పరువు మర్యాదలను కూడా కాపాడావమ్మా" అనింది.

తరువాత తన వివాహం సాల్మన్‌తో జరిగిపోయింది. జరిగినదాంట్లో సాల్మన్ తప్పేముంది? అందుకే అతనితో వివాహ జీవితంలో పూర్తిగా రాజీ పడింది. జీవితం సాఫీగా, సుఖంగా గడవటానికి పూర్తి సహకారాన్ని అందించింది. సాల్మన్ కూడా ఆమెకు ఎలాంటి లోటూ లేకుండా చూసుకున్నాడు. మొదట సాహిల్, తరువాత రెండు సంవత్సరాలకు జైని పుట్టారు. వారిరువురినీ చూసుకుంటూ గతమంతా మరిచిపోయింది. మమతానురాగాల మత్తు ఆమెను వెనక్కి తిరిగి చూడనీయలేదు. ఆ అవసరం కూడా కలగలేదు. సతీష్ కేవలం ఒకనాటి స్నేహితుడిగా మనసుపొరల్లో మిగిలిపోయాడు.

ఒకసారి సాహిల్‌కు రెండేళ్ళ వయసులో భర్తతో కలిసి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళటం జ్ఞాపకానికొచ్చింది. వారాంతంలో వారంతా 'టాహో' వెళ్ళారు. దారిలో వున్న 'రెనో' ఐలాండ్ కూడా వెళ్ళారు. అక్కడ విడాకులు తీసుకోవటం చాలా సులభం అని ప్రసిద్ధి చెందింది.

"అరె! మనం ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా మనం వెళ్ళిపోవాలి. లేకుంటే 'ఆశీ' నాకు విడాకులిచ్చినా యిస్తుంది" అన్నాడు సాల్మన్ సరదాగా.

"గాడ్ ఫర్ బిడ్" అందామె సాల్మన్ వైపు కోపంగా చూస్తూ.

"భాబీ! సాల్మన్ తమాషాగా అన్నాడు. నీవు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు" అంది సాల్మన్ వదినె.

'లేక్‌టావో'లో తిరుగుతూ, ఒక కేసినోలో దూరారు, అందరూ. తను పది డాలర్ల చిల్లర తీసుకుని గాంబ్లింగ్ టేబుల్ దగ్గర నిల్చుంది, ఆడటానికి. సాల్మన్ పిల్లల విభాగం చూపించటానికి సాహిల్‌ను తీసుకెళ్ళాడు. ఆమె భుజం మీద ఎవరిదో చెయ్యి పడినట్లనిపించి వెనుదిరిగి చూసింది. చిరునవ్వు చిందిస్తూ ఎదురుగా సతీష్.

"నువ్వు గాంబ్లింగ్ కూడా నేర్చుకున్నావన్నమాట" అన్నాడు.

"షటప్... ఇడియట్..." అంది చనువుగా.

"మీవారెక్కడ?"

"పిల్లవాడితో అక్కడున్నాడు" దిశ చూపించబోయేంతలో సాల్మన్ వచ్చాడు.

"ఆశీ నీ కొడుకును నీతోనే ఉంచుకో. వీడికి నిద్ర వస్తున్నట్లుంది" అంటూ.

"సాల్మన్! యితను నా ఫ్రెండ్. అంటే చిన్ననాటి స్నేహితుడన్నమాట" పరిచయం చేసింది.

"నైస్ టు మీట్ యు" అంటూ కరచాలనం చేశాడు సాల్మన్. ఆ రోజు సతీష్ కూడా వాళ్ళందరి వెంబడే తిరిగాడు ప్రదేశాలు చూస్తూ. తరువాత అతనెక్కడున్నా తన పుట్టినరోజుకి తూర్పుగాలిగా ఠంచన్‌గా గ్రీటింగ్ కార్డొచ్చేది.

***

వివాహమైన పదిహేడో సంవత్సరంలో

ఆమె జీవితనౌక తుఫానుతాకిడికి బలి యైంది. ఒక ప్రమాదం కారణంగా సాల్మన్ ఈ ప్రపంచ ం నుండి నిష్క్రమించాడు. యిద్దరు నేదరి పిల్లలతో తను ఒంటరిగా మిగిలిపోయింది. డబ్బుకు యిబ్బంది లేదు. తను స్వయంగా ఉద్యోగం చేస్తోంది. సాల్మన్‌కు రావాల్సిన పైకంకు తోడు, ప్రమాదం తాలూకు నష్టపరిహారం కొంత చేతికందింది. ఒక మనిషి జీవితానికి మూల్యం కొన్ని రూపాయలు. కాని మిగిలిన కాలమంతా తను ఈ గరళాన్ని తాగక తప్పదు. దుఃఖం అనే విషాన్ని ఆమె బలవంతంగా తాగింది. గవర్నమెంట్ క్వార్టర్ ఖాళీ చేసి, తన మామగారింటి సమీపంలో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుంది. అత్తమామలు తన పిల్లల పట్ల, తన పట్ల శ్రద్ధ తీసుకునేవారు. పిల్లలు కూడా వారికి బాగా మాలిమైనారు. ఒక ఆదివారం రోజున పిల్లలు వాళ్ళ నాయనమ్మ వాళ్ళింటికి వెళ్ళారు. ఆమె పేపరు చదువుతూ బాల్కనీలో కూర్చుంది. అనుకోకుండా సతీష్ ప్రత్యక్షమైనాడు. ఆ వూరు ఏదో పనుండి వచ్చాడు. చూసిపోదామని వచ్చాడట. అతన్ని చూడగానే తన శోకతప్త హృదయానికో తోడు దొరికినట్లనిపించింది. దుఃఖం వెల్లువలా పొంగింది. అతను ఆదరంతో సాంత్వనం అందించాడు. పొద్దుపోయిన వైనం కూడా గమనించకుండా వారిరువురూ కష్టసుఖాలు ఏకరువు పెట్టుకున్నారు. పిల్లలు వచ్చిన తర్వాత సతీష్ కూడా వారితోపాటే భోజనం చేసి పిల్లలతో సరదాగా గడిపాడు. తరువాత తన సూట్‌కేస్ తీసుకుని హోటల్ కోసం బయలుదేరాడు. కాని అతన్ని బలవంతంగా ఒప్పించి అక్కడే వుండేట్లు చేసింది. అతను సంశయిస్తుంటే...

"కమాన్ సతీష్. పదిహేడు సంవత్సరాలు కాపురం చేసి వయసుమళ్ళిన యిల్లాలిని. నీ తల కూడా బాగా నెరిసిపోయింది" అంటూ నవ్వేసింది.

"నీ వెంట్రుకలు కూడా తెల్లవే. కాని రంగేసి ఉంటావు" అన్నాడు.

"అవును సతీష్. ఇదివరకు- యిప్పుడు మానేశాను".

సతీష్ వచ్చిన మూడో రోజు, పిల్లలతో కలిసి బజారుకు వెళ్ళింది. అక్కడ సతీష్ తన మనసులో మాట మరోమారు బయటపెట్టాడు. తనను అతని జీవితంలోకి ఆహ్వానించాడు. "ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు?" అనింది విస్తుపోతూ. ఈ వయసులో తిరిగి వివాహమా?"

పైకి అలా అనిందిగానీ నిజానికి ఆమెలో కవలరం చెలరేగింది. అవును తను ఎందుకు తన జీవితంలోకి ఆహ్వానించకూడదు. తనకు దగ్గరివాడు. చిరకాల మిత్రుడు. ఒకనాటి ప్రియుడు. పైగా యింత వరకూ అవివాహితుడు. మనసు అల్లకల్లోలం అయింది. ఆ రాత్రి సరిగా నిద్ర పోలేకపోయింది.

ఉదయాన్నే పెద్ద బావగారు ప్రత్యక్షమై నేరుగా మాటల్లోకి దిగాడు.

"ఆశీ! నీతో పాటు ఫ్లాట్‌లో ఎవరో వుంటున్నారని విన్నాను. ఎవరతను?"

"నా చిన్ననాటి మిత్రుడు, సతీష్" తను జవాబిచ్చింది.

"మన సమాజంలో ఆడ, మగా స్నేహానికి ఒకే అర్థం తీస్తారనే విషయం నీకు తెలీదా ఆశీ? మన కుటుంబం పరువును మనసులో ఉంచుకోవటం మరిచిపోకు" అంటూ చిన్నపాటి లెక్చర్ యిచ్చాడు.

మళ్ళీ ఒక తుఫాన్. సతీష్ వెళ్ళిపోయాడు. మరోసారి ఆమె తన అత్తగారింటి పరువును కాపాడింది.

***

ఇప్పుడీ దశలో, పడమటి కొండల



ప్రయాణంలో సతీష్ మరోమారు ఎదురైనాడు. ఈ జీవన సాయంకాలంలో ఎందుకో అతని పునరాగమనం ఆమెలో ఆనందం నింపింది. ఆమె ప్రవర్తనలో కూడా మార్పు తెచ్చింది. దినమంతా ఆమె సాయంకాలం కోసం ఎదురుచూసేది. ఒకవేళ పిల్లలు పార్కుకు రానని మొరాయించినా బలవంతం చేసి తీసుకుపోయేది. సరైన వేళలకు మందులు మాత్రలు వేసుకోవటం మరువటం లేదు. గతంలో బయటికెళ్ళేటప్పుడు చీరె మార్చుకోమని చెప్పినా పట్టించుకోని తను, యిప్పుడు పెట్టెలోని మంచి మంచి చీరెలు కట్టుకోవటం, భుజం దగ్గర పొందికగా పిన్ను అమర్చుకోవటం, అప్పుడప్పుడూ మొఖానికి క్రీంలు రాయటం మొదలుపెట్టింది. ఏ విషయంలోనూ యిప్పుడు సాహిల్ మీద కోపం రావటం లేదు. కోడలి పుల్లవిరుపు మాటలు కూడా ఆమెనంత బాధించటం లేదు. పార్కులో పిల్లలు తమ దారిన తాము ఆటలాడుకుంటారు. తామిద్దరూ అటూ యిటూ తిరుగుతూ కబుర్లు చెప్పుకుంటారు. చదివిన పుస్తకాలు, చూసిన సినిమాలు, గతస్మృతుల నెమరువేతలు, వివిధ విషయాల మీద స్పందనలు- తరచి చూస్తే ఎవరి జీవితాలు వారు విడివిడిగా గడిపినా, ఒకే రకంగా జీవితాలు గడిచినట్లనిపించింది. అభిరుచులు, భావాలు యిరువురివీ ఒకేలా తోచాయి. ఆ గంటా, గంటన్నర కాలం ఎలా గడిచిందో తెలియకుండా గడిచేది. సతీష్ తరచు ఐస్‌క్రీంలు కొంటాడు. యిద్దరు పాత మిత్రురాలు చంపాను తలుచుకుంటారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక మాల్‌లో, న్యూయార్క్‌లో తను చంపను చూశాననీ, బాగా లావు అయిందని, కనుచూపు బలహీనమైందనీ చెప్పాడు సతీష్.

"నువ్వు దాన్ని ఎలా గుర్తుపట్టావు?"

"కొద్దిసేపు సందేహిస్తూ నిలబడ్డాను. కానీ ఆమె తన మనుమరాలితో కలిసి ఐస్‌క్రీం తింటుంటే గుర్తుపట్టాను"

యిద్దరూ పెద్దగా నవ్వుకున్నారు. యిప్పుడామెకు తన వయసు కొన్ని సంవత్సరాలు తగ్గినట్లనిపించింది. అసలు రికార్డుల్లో తన వయసు ఎక్కువ చేసి చూపారేమోనని అనుమానం కూడా కలిగింది. జీవన సంధ్యలో ఆనందమయమైన ఆ క్షణాలు... ఏ కోరికలకు, ఏ సాంత్వనలకు, ఏ అనురాగాలకు ప్రేరేపించాయో...

కానీ, ఆ ఆనందం, తృప్తి... ఒక్క మాటతో మరోసారి ఆమెనుండి దూరమైనాయి.

"అమ్మా నేవిన్నది నిజమేనా?"

"ఏమిటి సాహిల్?"

"నువ్వు ఎవరో ముసలాయనను పార్కులో కలవటం, మాట్లాడుకోవటం, నవ్వుకోవటం..."

"సాహిల్... ఆ ముసలాయన నా చిన్ననాటి స్నేహితుడు. సతీష్‌చంద్రజైన్"

"నాకు తెలుసు. నువ్వు అతన్ని ప్రేమగా సత్ అనీ, సతీష్ అనిపిలుస్తావని కూడా తెలుసు. నాన్న చనిపోయిన తర్వాత నిన్ను వలలో వేసుకుని, పెళ్ళి చేసుకోవాలని చూశాడనీ తెలుసు".

"నోర్ముయ్. యింకొక్కమాట అన్నావంటే మర్యాద దక్కదు"

"లేదమ్మా. నేను నోరు మూసుకుని చూస్తూ ఉండలేను. నా నోరు మూసినా యిరుగు పొరుగువారి నోర్లు మూయించలేనుగదా! వాళ్ళల్లో వాళ్ళే చెవులు కొరుక్కుంటున్నారు. అందుకనే నీకయిష్టమైనా నేను చెప్పక తప్పదు. ఈ రోజు నుండి పిల్లలను తీసుకుని నువ్వు పార్కుకు పోనవసరం లేదు. అతనితో కలవటానికి వీల్లేదు-'

"కనీసం నా పరువు మర్యాద గురించైనా ఆలోచించావా?"

•